క్లుప్తంగా

ఈ-కేవైసీ తప్పనిసరి

మధురపూడి: సొసైటీ పరిధిలోని సభ్యులందరూ ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని కోరుకొండ మండలం గాడాల వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈఓ ఉండమట్ల ఏడుకొండలబాబు కోరారు. కోరుకొండ మండలంలోని గాడాల, మధురపూడి, నిడిగట్ల, పాలచర్ల గ్రామాలకు చెందిన సభ్యులు ఆధార్ కార్డు, పాన్ నంబరు, రెండు పాస్‌పోర్టు ఫొటోలను తీసుకొచ్చి, సభ్యత్వాన్ని ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సొసైటీల్లో చేపట్టిన కంప్యూటరైజేషన్‌లో భాగంగా సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. సొసైటీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు.

సీతానగరం: రాపాక, రఘుదేవపురం, ముగ్గళ్ల, సీతానగరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని సభ్యులు తప్పనిసరిగా ఈ-కేవేసీ చేయించుకోవాలని పీఏసీఎస్ సీఈవోలు లక్ష్మణరావు, కాట్నం వెంకటేశ్వరరావు, ఎం.రామకృష్ణ, కాట్నం గణేష్ కోరారు.

చంద్రశేఖరస్వామికి మకర తోరణం సమర్పణ

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి స్వామికి గ్రామానికి చెందిన భక్తులు నామాల దొరబాబు, నాయుడు అమ్మిరాజు రూ.3,500 విలువైన మకర తోరణం సమర్పించారు. సోమవారం ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి నూతన మకరతోరణం అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం

మధురపూడి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సోమవారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో ఆయన భాగంగా ఇక్కడకు వచ్చారు. అనంతరం కాన్వాయ్‌లో పిఠాపురం వెళ్లారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి కృషి

పెదపూడి: నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తి మండలం రామవరంలో సోమవారం సాయంత్రం ఆర్‌అండ్‌బీ అధికారులతో నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఏ రోడ్లను నూతనంగా నిర్మించాలి, ఏ గ్రామాల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి, అత్యవసరంగా నిర్మించాల్సిన రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ నిక్కీ, ఏఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ట్రాలీ



అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కిన ట్రాలీ

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువులోని జీరో పాయింట్ వద్ద సోమవారం రాత్రి ఓ ట్రాలీ అదుపు తప్పి డివైడర్ మీదుకు దూసుకుపోయింది. ముందుకు కదలకుండా అక్కడే ఉండిపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ట్రాలీ రైలు చక్రాలు లోడుతో బెంగళూరు నుంచి పశ్చిమ బెంగాల్ వెళుతోంది.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పందలపాకలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఎంపీపీ మెయిన్ పాఠశాల వద్ద దాతలు విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఉపాధ్యాయుడు సబ్బారపు రమేష్, కర్రి రామకృష్ణారెడ్డిలు విద్యార్థులకు నోటు పుస్తకాలు సమకూర్చి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం డి.అప్పారెడ్డి మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్రి వీర్రాఘవరెడ్డి, సోమేశ్వరశర్మ, సుభాషిణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

7న ఎమ్మెల్యేకు సన్మానం

పెదపూడి: అనపర్తి నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మండపేట మండలం ద్వారపూడిలోని కల్యాణ మండపంలో సన్మాన సభ నిర్వహించనున్నట్లు కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్డి సోదరులంతా పార్టీలకతీతంగా హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మోగని పెళ్లి బాజా

- గత ఏప్రిల్ నుంచి మూఢం కారణంగా శుభకార్యాలకు సెలవు
- వచ్చే నెల 5వ తేదీ నుంచి 10 వరకే ముహూర్తాలు
- అది దాటిందో వచ్చే ఏడాది వరకూ ఎదురు చూడాల్సిందే



బిక్కవోలు: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సరైన ముహూర్తాలు లేక ఎక్కడా పెళ్లి బాజాలు మోగడం లేదు. కల్యాణ మండపాలు కళ తప్పాయి. శుభకార్యాలపై ఆధారపడిన వస్త్ర, బంగారు దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే సంబంధాలు కుదుర్చుకున్న వధూవరుల తల్లిదండ్రులైతే తమ పిల్లల పెళ్లిళ్లు త్వరగా చేయాలన్న ఆందోళనతో మంచి ముహూర్తాలు ఎప్పుడున్నాయోనని పండితుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే పండితులు మాత్రం ఈ ఏడాదిలో ఆగస్టు 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ మాత్రమే ఆరు ముహూర్తాలు ఉన్నాయంటున్నారు. అవి దాటాయంటే మళ్లీ వచ్చే ఏడాది జనవరి 30 వరకూ ఆగాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.

ఆరు రోజులే ముహూర్తాలు

గత ఏప్రిల్ నుంచి మూఢంతో పాటు సరైన ముహూర్తాలు లేక పెళ్లి బాజాలు ఎక్కడా వినిపించడం లేదు. ఈ నెల 5వ తేదీ నుంచి శూన్య మాసంగా భావించే ఆషాఢ మాసం ప్రారంభమవుతున్నందున ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. శూన్య మాసంలో వివాహాలు, ఇంటి శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాల ప్రారంభం, రిజిస్ట్రేషన్లు, నామకరణాలు తదితర శుభకార్యాలేవీ తలపెట్టరు. ఆగస్టు 5వ తేదీ నుంచి శ్రావణం ప్రవేశిస్తున్నా 10వ తేదీ వరకూ అంటే కేవలం ఆరు రోజులు మాత్రమే మంచి ముహూర్తాలు ఉన్నాయని పెళ్లిళ్ల పంతుళ్లు సెలవిస్తున్నారు. శ్రావణం తరువాత సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మరోసారి శూన్య మాసం రానుంది. వినాయక చవితి పండగ తెచ్చే భాద్రపద మాసం సైతం శూన్యమాసం కావడంతో శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. సంవత్సరం చివర డిసెంబరులో మార్గశిర మాసం కావడంతో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉన్నా బలమైన ముహూర్తాలు కావని వేద పండితులు ఆసక్తి చూపడం లేదు. వచ్చే ఏడాది ఫాల్గుణ మాసంలో ఫిబ్రవరి చివరి నుంచి మార్చి చివరి వరకూ వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయంటున్నారు. మధ్యలో కేవలం ఆరు రోజులు మాత్రమే ముహూర్తాలుండడంతో వధూవరుల తల్లిదండ్రులు అప్పుడే తమ పిల్లల పెళ్లిళ్లు చేసేయాలని తొందర పడుతున్నారు.

ఆగస్టు తప్పితే వచ్చే ఏడాదే



ఆగస్టు నెలలో తప్పితే వచ్చే ఏడాది వరకూ మంచి ముహూర్తాలు లేవు. శుభకార్యాలు తలపెట్టుకున్న వారంతా ఆగస్టు నెలలో ముహూర్తాలను సద్వినియోగం చేసుకోవాలి.
– గరిమెళ్ల విశ్వేశ్వరరావు, పండితులు, పందలపాక

వ్యాపారాలపై ప్రభావం

సాధారణంగా వివాహ ముహూర్తాలు ఉన్న సమయంలో వధూవరులు, వారి బంధుమిత్రుల కుటుంబాల్లోనే గాక వివాహ నిర్వహణకు అనుబంధంగా వ్యాపారం సాగించేవారిలోనూ ఆనందోత్సాహాలుంటాయి. ఈ ఏడాది వరుసగా నెలల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడిన వ్యాపారులు పూర్తి స్థాయిలో డీలా పడ్డాయి. ప్రధానంగా కేవలం పెళ్లిళ్లపై ఆధారపడి వ్యాపారం సాగిస్తున్న వస్త్ర, నగల వ్యాపారాలు పెళ్లి ముహూర్తాలు లేక కుదేలవుతున్నాయి. నియోజకవర్గంలోని కల్యాణ మండపాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పెళ్లి తంతు సాగించే పండితులకు సైతం గట్టి ఇబ్బందే వచ్చి పడింది. మరోవైపు పెళ్లిళ్లలో వంటావార్పునే జీవనాధారంగా బతుకుతున్న కేటరింగ్, భోజనాల తయారీ రంగం, డెకరేషన్, వీడియో, ఫొటోగ్రాఫర్లు సైతం గగ్గోలు పెడుతున్నారు.

అంకితభావంతోనే ఉద్యోగికి గుర్తింపు



పాండురంగారావును సన్మానిస్తున్న బీఎం రమేష్ రెడ్డి తదితరులు

రాజానగరం: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, అయితే విధి నిర్వహణలో చూపించిన అంకిత భావమే అతడికి మరింత పేరు తీసుకువస్తుందని సాక్షి రాజమహేంద్రవరం యూనిట్ బ్రాంచ్ మేనేజర్ రమేష్‌రెడ్డి అన్నారు. సాక్షి యూనిట్‌లో సర్క్యులేషన్ విభాగంలో సుదీర్ఘ కాలం సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన విశాల వెంకట నాగపాండురంగారావును యూనిట్ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సహోద్యోగులు గుర్తుచేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ప్రకటనల విభాగం) వీజీఎస్ఎన్ మూర్తి, సత్య ప్రసాద్ (అకౌంట్స్), స్టోర్స్ ఇన్‌చార్జి రామారావు, ఐటీ ఇన్‌చార్జి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బురదకాలువ ముంపుతో అవస్థలు



బురదకాలువ నీటితో ముంపు బారిన పడిన శ్రీరంగపట్నం బీసీ కాలనీ

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని పలు ప్రాంతాలు సోమవారం బురద కాలువ నీటి కారణంగా ముంపునకు గురయ్యాయి. గ్రామంలోని పండుల్లమ్మ దేవాలయం సమీప ప్రాంతం, రాఘవపురం నుంచి వచ్చే రోడ్డులోని బీసీ పేటలలో మోకాలు లోతు నీరు నిలిచింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బురద కాలువ నుంచి నీరు నివాస ప్రాంతాలకు చేరింది. సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు ఏర్పడుతున్న ఈ ముంపు సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 20 ఏళ్లుగా ఈ సమస్య నెలకొంది. కాగా.. కోరుకొండ తహసీల్దార్ రాజలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని ముంపు బాధితులతో మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ



రామవరంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తి మండలంలోని రామవరం, అనపర్తి గ్రామాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అనపర్తి సర్పంచ్ వారా కుమారి, తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో 20 సచివాలయాల్లో సోమవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ 95శాతం మేర పూర్తయిందని ఎంపీడీఓ పిఆశాజ్యోతి తెలిపారు. మండలంలో మొత్తంగా 181 మంది సచివాలయ, ఇతర ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో ఈఓపీ ఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, బి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, మాజీ ఎంపీటీసీ సబ్బారపు సూర్యనారాయణ, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రంగంపేట: గ్రామాల్లోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అప్పుడే ఆరోగ్యకర సమాజం రూపుదిద్దుకుంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్టాప్ డయేరియా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీజ్, ఐసీడీఎస్ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, తహసీల్దార్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ పి.వెంకటరత్నం, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, డాక్టర్ కె.చిన్నారావు, సీహెచ్‌ఓ కె.జయమణి పాల్గొన్నారు.

డాక్టర్లు దైవ స్వరూపులు

- వైద్యుల దినోత్సవంలో కొనియాడిన వక్తలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి సత్కారం



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న విద్యార్థులు



డాక్టర్ కోనాల రామకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ తమ్మిరెడ్డి



సీతానగరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్



డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డిని సత్కరించిన ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు

పెదపూడి: రోగులకు సేవలందించడంలో డాక్టర్లు దైవ స్వరూపులని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం అనపర్తిలోని గంగిరెడ్డి నర్సింగ్‌హోమ్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమని అలాంటి వైద్యులను అందరూ గౌరవించాలన్నారు. అనపర్తి టీఏఆర్ స్కూల్ విద్యార్థులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీసూర్య ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక రామకృష్ణారెడ్డి నర్సింగ్‌హోమ్ వైద్యులు కోనాల తమ్మిరెడ్డి, కోనాల నరసింహరెడ్డి, లక్ష్మీతులసి రెడ్డి, కార్తికేయ నర్సింగ్‌హోమ్ వైద్యుడు ద్వారంపూడి వీర్రాఘవరెడ్డిలకు క్లబ్ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి నర్సింగ్‌హోమ్ వ్యవస్థాపకుడు డాక్టర్ కోనాల రామకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్‌ఏఆర్‌కే చౌదరి, పప్పు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

325 మందికి వైద్యసేవలు

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో సోమవారం సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్లు రాయుడు శ్రీనివాస్, సత్యం రమేష్ బాబు తదితరులు 325 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె.శ్రీనివాసరావు, కె.సత్తిబాబు, గద్దె శ్రీరామచంద్రరావు పాల్గొన్నారు.

బిక్కవోలు: డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పందలపాక గ్రామానికి సూరారెడ్డి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డిని ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాయవరం పీఎంపీ సంఘ కన్వీనర్, రాయవరం ఎంపీపీ నౌడు వెంకట రమణ మాట్లాడుతూ ప్రజా సేవలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో బిక్కవోలు పీఎంపీ సంఘ కన్వీనర్ ద్వారంపూడి సాయి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



రాజానగరం పీహెచ్‌సీలో వైద్యులను సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ అసోసియేషన్ సభ్యులు

రాజానగరం: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వైద్యరంగానికి చెందిన ప్రముఖులను సన్మానించారు. ఈ సందర్భంగా మండల ఆర్‌ఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రామభాస్కర్, వెంకటలక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాపాక మోషే, కార్యదర్శి ఎస్.అన్నవరం, సభ్యులు చిరంజీవి, రాంబాబు. నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులకు వైద్యులు అందించే సేవలను తెలియజేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనపర్తిలోని సీవీఆర్ ఆస్పత్రి వైద్యులు కె.సునీల్ కుమార్, కె.బాంధవిలను ఘనంగా సన్మానించారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో రాజానగరం పీహెచ్‌సీ వైద్యులు రామభాస్కర్, వెంకటలక్ష్మిలను సత్కరించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రన్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనే అందరి లక్ష్యం



కోరుకొండ పీహెచ్‌సీలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



ఇనుగంటివారిపేటలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందిస్తున్న డాక్టర్ రాజు

మధురపూడి: డయేరియాను సంపూర్ణంగా నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు అన్నారు. కోరుకొండ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన స్టాప్ డయేరియా శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు రక్షిత నీటిని మాత్రమే తాగాలని, దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందజేయాలని ఆశ వర్కర్లకు సూచించారు. కోరుకొండ పీహెచ్‌సీ వైద్యులు ఐ.జ్ఞానచంద్ర, ప్రజ్ఞ మాట్లాడుతూ జ్వరం, ఇతర ఏదైనా అనారోగ్యం కలిగితే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి రావాలన్నారు. గాదరాడ గ్రామంలోనూ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కోరుకొండ సర్పంచ్ సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, పంచాయతీ సెక్రటరీ రమేష్ బాబు, ప్రజా ప్రతినిధులు కర్రి గణేష్ పాల్గొన్నారు.

సీతానగరం: ఇనుగంటివారిపేటలో స్టాప్ డయేరియా శిబిరాన్ని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. డయేరియాను అదుపు చేసే పద్ధతులు, తల్లిపాల ఆవశ్యకత, ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రల ఉపయోగాలు, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్‌బాబు తదితరులు ఉన్నారు. బొబ్బిల్లంకలో పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

సీతానగరం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం సీతానగరం బస్ స్టేషన్ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ప్రమాదం జరిగితే గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లితే వారికి స్టేషన్ బెయిల్ వస్తుందని, లేని పక్షంలో వారికి బెయిల్ మంజూరు కావడం కష్టమన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

కోటి లింగాల తయారీ



మట్టి లింగాల తయారీలో పాల్గొన్న భక్తులు

మధురపూడి: స్థానిక హరేరామ నగర్‌లో కోటి మట్టి లింగాల తయారీ ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. స్థానిక మహిళలు, పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చాలా లింగాలను తయారు చేశారు. వీటిని కాశీ తీసుకువెళ్లి అభిషేకం చేయనున్నారు.

'కాటవరం' నుంచి సాగునీరు విడుదల



కాటవరం పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, వెంకటరమణ చౌదరి

సీతానగరం: రైతులు సాగునీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. కాటవరం పంపింగ్ స్కీమ్ నుంచి మూడు వేల ఎకరాలకు సాగునీటిని సోమవారం విడుదల చేశారు. తొలుత మోటార్లకు పూజలు నిర్వహించి, అనంతరం స్విచ్ ఆన్ చేసి సాగునీటిని వదిలారు. జలవనరులశాఖ డీఈ గురవయ్య, ఏఈ సురేంద్ర పాల్గొన్నారు. తొలుత సీతానగరంలో పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే జాలిమూడి శివారున గోదావరి వరద కారణంగా కోతకు గురవుతున్న ఏటిగట్టును పరిశీలించారు. అనంతరం బొబ్బిల్లంక, ములకల్లంక రేవు వద్ద గల రక్షణ గోడను ఆనుకుని పడిన బొరియను పరిశీలించారు.

39,777 మందికి సామాజిక పింఛన్లు

రాజానగరం: నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 39,777 మందికి రూ.26.67 కోట్లను సామాజిక పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. మండలంలోని నందరాడలో సోమవారం జేసీ తేజ్ భరత్, ఇతర అధికారులతో కలిసి పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీని సందర్శన

ఆదికవి నన్నయ యూనివర్సిటీని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం సందర్శించారు. యూనివర్సిటీకి తొలిసారిగా వచ్చిన ఆయనకు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ భవన నిర్మాణాలపై ఆరా తీశారు. యూనివర్సిటీ అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. ప్రతి సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలన్నారు. వైస్ ఎంపీపీ కొల్లి సత్య, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి వెంకన్న, కోఆప్షన్ సభ్యుడు కోడి రాఘవ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వివరాలను కంప్యూటరైజేషన్ చేయించుకోవాలి

రంగంపేట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లిమిటెడ్ పరిధిలోని సభ్యులందరూ తమ వివరాలను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని రంగంపేట పీఏసీఎస్ ముఖ్య కార్య నిర్వహణాధికారి బొడ్డు త్రిమూర్తులు, రాజమహేంద్రవరం సబ్ డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ షేక్ మస్తాన్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగంపేట పీఏసీఎస్ పరిధిలోని రంగంపేట, వడిశలేరు, పెదరాయవరం, చంద్రేడు, కోటపాడు, రామేశ్వరంపేట, వెంకటాపురం, ముకుందవరం, సుభద్రంపేట గ్రామాల్లో మెంబర్ షిప్ ఉన్న రైతులంతా ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈ నెల 4వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటల లోపు వచ్చి కంప్యూటరైజేషన్‌కు సహకరించాలని కోరారు. సొసైటీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇది అవసరమన్నారు.